ప్రజాశక్తి
మంగళవారం 11 నవంబర్ 2025 5 విజయనగరం

అధికారులకు వినతినిస్తున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు

అరకొరగా పల్లె పండగ

- నిర్మాణానికి నోచుకోని 2,496 రోడ్లు, కాలువలు
- చేపట్టిన పనులకు రూ.97.79 కోట్ల బకాయి
- లక్ష్యానికి చేరుకోని గోకులాలు
- పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా పల్లెపండగ కార్యక్రమం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గతుకుల మయమైన గజపతినగరం మండలం గంగచోళ్లపెంట రోడ్డు

జిల్లాలో పల్లె పండగ సగం వరకే వచ్చింది. మిగిలిన పనుల్లో చాలా వరకు అర్థాంతరంగాను, ప్రారంభ దశలోనూ నిలిచిపోయాయి. ఉపాధిహామీ మెటీరియల్ కాంపొనెంట్ నిధులతో పల్లెపండగ కార్యక్రమం కింద గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సిసి రోడ్లు, బి.టి.రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాన్ని గత ఏడాది అక్టోబర్‌లో ప్రభుత్వం చేపట్టిన సంగతి విధితమే. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 4,967 పనులు మంజూరు కాగా, పూర్తయినవి కేవలం 2,471 పనులు మాత్రమే. మిగిలిన 2,496 పనుల్లో కొన్ని పెండింగ్‌లో ఉండగా, చాలావరకు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో, గ్రామీణ రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. నిధులు విడుదలకు మీనమేషాలు లెకిస్తుండమే ఇందుకు కారణం.

గ్రామీణ జాతీయ ఉపాధి హామీ కింద చేపట్టిన పనులకు విడుదలైన మొత్తం వేతనంపై 40శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం మెటీరియల్ కాంపొనెంట్ పనుల కోసం విడుదల చేయాల్సివుంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వం తరపున మ్యాచింగ్ గ్రాంట్ విడుదలచేసి గ్రామాల్లో నిర్మాణ పనులు చేపట్టే వారు. గత వైసిపి ప్రభుత్వం రోడ్లు, కాలువలు నాన్ ప్రాయార్టీ కింద పెట్టింది. గ్రామ సచివాలయాలు, ఆర్‌బికె, బల్కుమిల్కు సెంటర్లు, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలను ప్రాధాన్యతలో పెట్టింది. టిడిపి - జనసేన ప్రభుత్వం ఏర్పడ్డాక ఆయా భవన నిర్మాణాలను నాన్ ప్రేయార్టీలో పెట్టి, గ్రామాల్లోని రోడ్లు, కాలువలు, గోకులాల నిర్మాణాలకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పింది. గత ప్రభుత్వం తీసుకున్న ప్రాధాన్యత పనులు ఆమేరకు ముందుకు సాగినప్పటికీ, కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రాధాన్యత పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో 2024-2025 ఆర్థిక సంవత్సరంలో రూ.350 కోట్ల మెటీరియల్ కాంపొనెంట్ నిధులు అందుబాటులో ఉండేవి. వీటిని వినియోగించుకొని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కాలువల నిర్మాణం వంటి పెద్ద ఎత్తున మౌలిక వసతులను కల్పించేందుకు సంకల్పించారు. వీటితోపాటు పశువుల సంరక్షణ కోసం గోకులం షెడ్లను కూడా మంజూరు చేసింది. ఈ పనులన్నీ గడిచిన సంక్రాంతి నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ ఆచరణలో అమలుకు నోచుకోలేదు. ఇప్పటి వరకు రూ.222.88కోట్ల విలువైన పనులు జరగ్గా, కేవలం రూ.125.09కోట్ల మేర మాత్రమే బిల్లులు అయ్యాయి. ఇంకా రూ.97.79కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో సంబంధిత కాంట్రాక్టర్లు లబోదిబోమం టున్నారు. దీంతో, కొత్తగా పనులు చేపట్టేందుకు కూడా ఆసక్తి చూపలేకపోతున్నామని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో, పనులు కూడా సగానికి సగం పెండింగ్‌లో ఉండిపోయాయి. చాలా వరకు పనులు ఎర్త్ వర్కు, సిమెంటు కాంక్రీటుపూత వంటి దశల్లో నిలిచిపోయాయి.

గోకులాలు కూడా అంతంతమాత్రంగానే నిర్మితమయ్యాయి. కేవలం రెండు పశువుల కోసం నిర్మించే షెడ్లకు రూ.1.15 లక్షలు, నాలుగు పశువుల కోసం రూ.1.85 లక్షలతో, ఆరు పశువుల కోసం రూ.2.30 లక్షలతో షెడ్లను మంజూరు చేశారు. ఈషెడ్ల నిర్మాణానికి అయ్యే వ్యయంతో ఉపాధిహామీ నిధుల నుంచి 90 శాతం మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తోంది. 10శాతం మొత్తాన్ని గోకులం షెడ్డు నిర్మించే రైతు భరించాల్సి వుంటుంది. శాశ్వత స్థాయి నిర్మాణాలుగా ఈ షెడ్లను చేపట్టడంతో జిల్లాలో రైతాంగానికి పశువుల సంరక్షణ కోసం సొంత నిధులను వెచ్చించే భారం తగ్గడంతోపాటు పశువులకు అన్ని కాలాల్లోనూ మంచిరక్షణ, వసతి ఏర్పాటు చేసినట్లవుతుందని ప్రభుత్వం చెబుతోంది. కానీ, పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్టుగా అందుకు తగ్గట్టు నిర్మాణాలు జరగలేదు. జిల్లాలో మొత్తం 1900 గోకులం షెడ్లను రూ.30 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించాలని లక్ష్యం పెట్టుకోగా, ఆచరణలో 1260 మాత్రమే మంజూరు చేశారు. ఇందులోనూ పూర్తిచేసినవి కేవలం 359 మాత్రమే. ఇప్పటికైనా పనులు వేగవంతం చేయాలని, ఇందుకనుగుణంగా నిధులు విడుదల చేయాలని లబ్ధిదారులు, సంబంధిత కాంట్రాక్టర్లతోపాటు ప్రజానీకం కోరుతున్నారు.

రెండో ఎఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెండో ఎఎన్‌ఎంలను పర్మినెంట్ చేయాలని ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ రెండవ ఎఎన్‌ఎంల యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.కళావతి, కెఎం గౌరిశ్వరి కోరారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట రెండో ఎఎన్‌ఎంలు నిరసన తెలిపారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వర్క్ అడ్జస్టుమెంట్ పేరుతో అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న రెండవ ఎఎన్‌ఎంలను వేరే జిల్లాలకు బదిలీ చేశారన్నారు. దీనివల్ల మూడేళ్లగా ఆర్థికంగానే కాక మానసికంగా ఇబ్బందులు పడుతున్నారని, వీరి పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మానవతా దృక్పథంతో పరిశీలించి వారి వారి ప్రాంతాలకు తిరిగి పంపాలని కోరారు. గతంలో మాదిరి యూనిఫారం, యూనిఫారం అలవెన్స్ చెల్లించాలన్నారు. 180 రోజులు చైల్డ్ కేర్ లీవ్ లు ఇవ్వాలన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు, కాంపోనెంట్ అపాయిం ట్మెంట్స్ ఇవ్వాలని కోరారు. సచివాలయ హెల్త్ సెక్రటరీ ఖాళీల్లో ప్రాధాన్యత ఇచ్చి నియమించా లన్నారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి పి.విజయ పాల్గొన్నారు.

రాజకీయ ఒత్తిళ్లతో ప్రమోషన్ల ఆపకూడదు

రాజాం అంగన్వాడీ ప్రాజెక్టు లో అర్హత కలిగిన నలుగురు అంగన్వాడీ హెల్పర్లకు వర్కర్లుగా ప్రమోషన్లు తక్షణమే ఇవ్వాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్ లో వినతి అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.లక్ష్మి మాట్లాడుతూ రాజాం ప్రాజెక్టు వంగర మండలం కింజంగి 1 సెంటర్‌లో కిల్లాడ అనసూయ, మరువాడ వన్ సెంటర్‌లో జి.లీలావతి, సంగం 3 సెంటర్‌లో పిడకల జ్యోతి, సంతకవిటి మండలం మండకురిటి 3 సెంటర్‌లో ముగడ భాగ్యలక్ష్మి హెల్పర్లుగా పనిచేస్తున్నారని, ఈ సెంటర్లలో ఏడాది నుంచి వర్కర్ పోస్టులు ఖాళీ ఉన్నాయని తెలిపారు. ఏడాది క్రితమే జీవో2 ప్రకారం హెల్పర్లకు వర్కర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని సిడిపిఒ, పీడీ ఆఫీసుల్లో దరఖాస్తు చేశారని తెలిపారు. ఈనెల 11న వీరిని ప్రమోషన్ ఆర్డర్స్ ఇస్తామని చెప్పి రాజాం ప్రాజెక్టు ఆఫీస్‌కు పిలిపించి, మళ్లీ ఎమ్మెల్యే పిఎ నిలిపివేయమన్నారని వెనక్కి పంపించేశారని తెలిపారు. రాజకీయాల ఒత్తిడివల్ల కావాలనే ప్రమోషన్లు ఇవ్వకుండా తాత్సారం చేయడం సరైనదికాదని అన్నారు. వెంటనే ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. రాజాం ప్రాజెక్టు కార్యదర్శి సిహెచ్ రూపవతి, హెల్పర్స్ కె.అనసూయ, ఎస్.జ్యోతి, జి.లీలావతి పాల్గొన్నారు.

ఫిర్యాదుదారు సంతృప్తే ముఖ్యం : కలెక్టర్

అధికారులంతా ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించే ఒదుకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులు స్వీకరించారు. మొత్తం 178 ఫిర్యాదులు అందాయి. విజ్ఞప్తులను స్వయంగా పరిశీలించిన కలెక్టర్ దరఖాస్తుదారు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం ఉండాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై ఫాలోఅప్ చర్యలు తీసుకొని, పరిష్కారం వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎస్. శ్రీనివాస్‌మూర్తి, ఎస్‌డిసిలు వెంకటేశ్వర రావు, మురళి, రాజేశ్వరి, ప్రమీలాగాంధీ, బి.శాంతి, కళావతి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ ఒత్తిళ్లతో అంగన్వాడీ హెల్పర్ల ప్రమోషన్ల ఆపొద్దు

పిజిఆర్‌ఎస్‌లో వినతుల వెల్లువ

కలెక్టరేట్‌వద్ద నిరసన తెలుపుతున్న రెండో ఎఎన్‌ఎంలు

షాప్‌లను బహిరంగ వేలం ద్వారా కేటాయించండి

ఎస్. కోట లో వున్న పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ లో షాప్ లను బహిరంగ వేలం ద్వారా నిజమైన వ్యాపారులకు కేటాయించి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా కాపాడాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గం కన్వీనర్ పూసపాటి ప్రతాప్ వర్మ కలెక్టర్‌ను కోరారు. షాపింగ్ కాంప్లెక్స్ లో షాప్ లను దక్కించుకున్న వారు అధిక అద్దెలకు ఇతరులకు అద్దెకు ఇచ్చి ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొడుతున్నారని తెలిపారు.

ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

గుర్ల మండలం పున్నపురెడ్డి పేటకు చెందిన.. జమ్ముపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పున్నపురెడ్డి రామారావుపై సొంత గ్రామస్థులు గ్రీవెన్సులలో ఫిర్యాదు చేశారు. దుర్గాదేవి గుడి ఆవరణలో దున్నపోతు వధ లాంటి జంతు బలులను వేయిస్తూ హింసత్మాక చర్యలకు పాల్పడు తున్నారని తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయునిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

అరసాడ గ్రామంలో ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

రూ.102 కోట్లతో బయోగ్యాస్ ప్లాంట్

నేడు రాజాంలో వర్చువల్‌గా శంకుస్థాపన

ప్రజాశక్తి-వంగర

మండలంలోని అరసాడ గ్రామంలో పివిఎస్ గ్రూప్ ఆధ్వర్యంలో సుమారు రూ.102 కోట్ల వ్యయంతో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు కానుంది. దీని నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కనిగిరి నుండి మంగళవారం ఉదయం 10.30 గంటలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు. ఈ వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని రాజాం తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. అరసాడ గ్రామంలో ప్లాంట్ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని సోమవారం కలెక్టర్ సందర్శించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోజుకు 20 టన్నులు ఉత్పత్తి సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 500 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. దీని అనుబంధంగా మరికొన్ని యూనిట్లు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ లక్ష్మణరావు, ఆర్‌డిఒ సత్యవాణి, తహశీల్దార్ పి.రామారావు, నెడ్‌కాప్, ఎపిఇపిడిసిఎల్ అధికారులు, పివిఎస్ సంస్థ ప్రతినిధి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలను పరిష్కరించాలి : ఎఎస్‌పి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

బాధితుల సమస్యలను పరిష్కరించాలని ఎఎస్‌పి పి.సౌమ్యలత పోలీసు అధికారులకు సూచించారు. జిల్లాపోలీసు కార్యాలయంలో వినతులు నిర్వహించారు. 42 ఫిర్యాదులను స్వీకరించారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐ అంబేద్కర్, డిసిఆర్‌బి సిఐ కె.కుమారస్వామి, ఎస్ఐ రాజేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు అప్పగింత

ప్రజాశక్తి- కంటోన్మెంట్

నగరంలోని బాబామెట్టకు చెందిన బూర రాజేశ్వరి తన కుటుంబంతో రాత్రి 11గంటల సమయంలో నిద్రిస్తుండగా తన కుమారుడైన దిలీప్ కుమార్ (13)కు మతి స్థిమితం లేకపోవటంతో ఆదివారం అర్ధరాత్రి ఇంటి నుండి బయటకు వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే విజయనగరం టూ టౌన్ సిఐ టి.శ్రీనివాస రావు దృష్టికి తీసుకెళ్లగా వెంటనే సిఐ టౌన్ గస్తీ విధుల్లో వున్న సిబ్బందిని అలెర్ట్ చేశారు. సిబ్బంది స్థానికుల సహకారంతో పూల్‌బాగ్ శివార్లలో పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న టూటౌన్ సిఐ శ్రీనివాసరావు

గ్రీన్ ఫీల్డ్ హైవేలో ఇళ్లు కోల్పోతున్న

దళిత కుటుంబాలకు న్యాయం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి - కొత్తవలస

విశాఖ- రాయపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం కొత్తవలస తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో బాధితులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ కొత్తవలస మండలం ఉత్తరాపల్లి పంచాయతీ గాంధీనగర్‌లో 55 సంవత్సరాలుగా 30 కుటుంబాల వారు అక్కడే గృహాలు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారని, ఇంటర్ ఛేంజ్ పేరుతో ఆ గృహాలను ఖాళీ చేయించాలని చెప్పడం దారుణమని అన్నారు. తాము అభివృద్ధికి ఆటంకం కాదని, అభివృద్ధి పేరుతో ఇళ్లను తొలగిస్తే ఎక్కడ నివాసం ఉండాలని ప్రశ్నించారు. ప్రభుత్వం గతంలో తమకు కాలనీలు మంజూరు చేస్తే ఇక్కడ జీవనోపాధి పొందుతున్నామని, నష్టపరిహారం, ప్రత్యామ్నాయం చూపకుండా అర్ధాంతరంగా ఇప్పుడు ఖాళీ చేయించాలని చెప్పడం సరికాదని అన్నారు. న్యాయం చేయకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ పి.అప్పలరాజుకు వినతి అందజేశారు. కార్యక్రమంలో గాంధీనగర్ వాసులు, సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతినిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

సిపి బ్రౌన్ కృషి చిరస్మరణీయం : డిఆర్ఒ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆంధ్రభాషా పండితుడు, తెలుగు నిఘంటువు రచయిత సి.పి. బ్రౌన్ జయంతి సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాస మూర్తి కలెక్టరెట్ ఆడిటోరియంలో బ్రౌన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ, తెలుగు భాషను సంరక్షించడానికి, ప్రాచీన సాహిత్యాన్ని రక్షించడానికి సిపి బ్రౌన్ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. కార్యక్రమంలో సెట్విజ్ సిఇఒ వి.విశ్వేశ్వర రావు, సిపిఒ బాలాజీ, డిఇఒ మాణిక్యం నాయుడు, డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాస్ పాణి, ఎస్‌డిసిలు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్కృత కళాశాలలో

విజయనగరం టౌన్ : మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ఆవరణలో సి.పి.బ్రౌన్ జయంతి వేడుకలు జరిగాయి. కళాశాల ప్రాచార్యులు డాక్టర్ జి.జనార్దన్ నాయుడు, సభాధ్యక్షులు జ్యోతి వెలిగించి నివాళులర్పించారు. బ్రౌన్ సేవలను విద్యార్థులకు వివరించారు. తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ వి.కన్నం నాయుడు తదితరులు సి.పి.బ్రౌన్ సేవలను కొనియాడారు.

సిపి బ్రౌన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిఆర్ఒ తదితరులు

30లోగా గృహాల సర్వే

ప్రజాశక్తి-కంటోన్మెంట్

గృహాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను సర్వే చేసి అర్హత ఉన్న వారి వివరాలను యాప్‌లో ఎంపిడిఒ నమోదు చేయాలని డిఆర్ఒ శ్రీనివాసమూర్తి తెలిపారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 30 వరకు ప్రభుత్వం సర్వే కోసం సమయం ఇచ్చిందని, లబ్ధిదారుల సర్వే పూర్తి చేసి అప్‌లోడ్ చేయాలని తెలిపారు. మండల ప్రత్యేకాధికారులు సచివాలయాల తనిఖీ చేసి ప్రొఫార్మాలో వివరాలను నమోదు చేసి సమర్పించాలని సూచించారు.

పిజిఆర్‌ఎస్‌లో అందిన వినతులకు సంబంధించి అర్జీదారులను కలిసి మాట్లాడిన తర్వాతే వారి సమస్య పై ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని డిఆర్ఒ శ్రీనివాసమూర్తి తెలిపారు. అర్జీదారునితో మాట్లాడిన తేదీ, సమయం కూడా వారి రిపోర్ట్ లో నమోదు చేయాలని సూచించారు. పిజిఆర్‌ఎస్ నోడల్ అధికారి మురళి మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్ టోల్ ఫ్రీ నెంబర్ 1100 పై అవగాహన కలిగించాలని తెలిపారు.

సఫాయి కర్మచారి యువతకు రుణ అవకాశం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలోని సఫాయి కర్మచారి వృత్తిలో వున్న నిరుద్యోగ యువతకు ఎన్ఎస్‌కెఎఫ్‌డిసి రుణ పథకంలో మూడు సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలు సబ్సిడీపై మంజూరు చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఎస్‌సి కార్పొరేషన్ ఇడి వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనం యూనిట్ విలువ రూ.31,67,326 కాగా, ఇందులో సబ్సిడీ రూ.14,16,831, రుణం రూ.17,50,495 అని తెలిపారు. సబ్సిడీ పోను మిగిలిన రుణాన్ని 6 శాతం వడ్డీతో 72 నెలసరి వాయిదాలలో, ఒక్కొక్క వాయిదా నెలకు రూ.33,064 చొప్పున క్రమం తప్పకుండా చెల్లించాలని తెలిపారు. ఐదుగురు అభ్యర్థులు గ్రూపుగా ఏర్పడిన వారికి మాత్రమే మంజూరు చేస్తామని తెలిపారు. ఈ ఐదుగురు సభ్యులు సఫాయి కర్మచారి సర్టిఫికేట్ లు తప్పని సరిగా కలిగి ఉండాలని, ఒకరికి హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు నేరుగా, కార్యనిర్వాహక సంచాలకులు, జిల్లా షెడ్యూల్డు కులాల సేవా సహకార సంస్థ, మర్రిచెన్నారెడ్డి భవనంలో నేరుగా గాని, పోస్టు ద్వారా గాని ఈనెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9030014742/ 9642460838/ 9652600967 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రహదారి భద్రత నియమాలు పాటించాలి

ప్రజాశక్తి కంటోన్మెంట్

ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలని మహిళా పోలీసు స్టేషన్ డిఎస్‌పి ఆర్.గోవిందరావు సూచించారు. సోమవారం శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్, రహదారి భద్రతా నియమాలు, సైబర్ నేరాలు, సోషల్ మీడియా కేసులు, శక్తీ యాప్, పోక్సో కేసులు, డిజిటల్ అరెస్టు, మాదక ద్రవ్యాలు, గంజాయి వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సి హెచ్. సూరి నాయుడు అవగాహన కల్పించారు. విద్యార్థుల శక్తి యాప్ డౌన్లోడ్ చేయడం, దాని పని తీరు గురించి వివరించారు. మహిళల మొబైల్ ఫోనులో శక్తి యాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో రక్షణగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు లక్ష్యంపై దృష్టి పెట్టి చదువుకోవాలని, ఇతరులపట్ల ఆకర్షితులు కావద్దని, సూచించారు. సైబరు నేరాలు, డిజిటల్ అరెస్టులు పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు.

రన్నర్స్‌గా నిలిచిన విజయనగరం బాలికల జట్టు

అండర్ 19 ఖోఖో విజేత ప్రకాశం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెండు రోజులు పాటు జరిగిన అండర్ 19 ఖోఖో రాష్ట్రస్థాయి పోటీల్లో బాల బాలికల విభాగాల్లో విజేతగా ప్రకాశం జిల్లా జట్లు నిలిచాయి. ద్వితీయ స్థానంలో విజయనగరం బాలురు, బాలికల జట్లు, తృతీయ స్థానంలో బాలురు విశాఖపట్నం, బాలికల విభాగంలో చిత్తూరు జిల్లా జట్లు నిలిచాయి. విజేతలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఇంటర్ విద్యా శాఖ అధికారి ఎస్. తవిటినాయుడు చేతులమీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కార్పొరేషన్ల డైరెక్టర్లుగా పలువురు నియామకం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాకు చెందిన పలువురు టిడిపి, జనసేన, బిజెపి నాయకులకు పలు కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లుగా నియమిస్తూ టిడిపి కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దాసరి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎస్.కోటకు చెందిన రమణాజీ, బంగారు నాయుడులను నియమించింది. కళింగ కోమటి కార్పొరేషన్ డైరెక్టర్‌గా విజయనగరానికి చెందిన మల్లేశ్వరరావు, నాగవంశపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నెల్లిమర్లకు చెందిన కాళ్ల సత్యవతి, కొండల శ్రీనివాసరావు, కళింగ వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్‌గా బొబ్బిలికి చెందిన సుంకరి సాయి నియమితులయ్యారు.

అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

అక్రమ నిర్మాణాలపై కొరడా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక అయ్యన్నపేటలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని నగరపాలక సంస్థ ప్రణాళిక అధికారులు అడ్డుకున్నారు. పునాదులు వేస్తున్న క్రమంలోనే పనులను అడ్డుకొని నిర్మాణాన్ని నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ అనుమతి లేని అక్రమ నిర్మాణాలను ఎట్టి పరిస్థితులలోనూ ఉపేక్షించబోమని అన్నారు. ప్రతి నిర్మాణానికి ప్రభుత్వ అనుమతులు తప్పనిసరని అన్నారు. అదనపు నిర్మాణాలకు సైతం అనుమతులు తీసుకోవాలన్నారు. లేనియెడల అట్టి నిర్మాణాలను కూడా అడ్డుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిపిఒ అప్పలరాజు, ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గీత కార్మికులను ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి- కంటోన్మెంట్

కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కరించాలని , గతంలో ఇచ్చిన 560 జీవో అమలు చేయాలని చేతి వృత్తి దారుల సమైక్య రాష్ట్ర కార్యదర్శి కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అమర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ఆంధ్రప్రదేశ్ కల్లుగీత పని వార్ల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామాంజ నేయులు మాట్లాడుతూ కల్లుగీత కార్మికులకు గతంలో ఇచ్చిన 540 జీవో అమలు చేసి కళ్ళు చెట్లకు మార్కింగ్ ఇవ్వాలన్నారు. వృత్తిలో మరణించిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని, వికలాంగులకు పెన్షన్లు మంజూరు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షులు కె.అప్పారావు, గౌరవాధ్యక్షులు పురం అప్పారావు, ప్రధాన కార్యదర్శి కొలుసు కోటారావు మాట్లాడారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రాష్ట్రస్థాయి పోటీలకు అలుగోలు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం బి.కస్తూరి తెలిపారు. రాష్ట్ర స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ప్రభాస్, ప్రసాద్, లోకేష్, రాజేశ్వరి, దేవి ఎంపికయ్యారని వీరంతా ఈ నెల 11న శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. సెపక్ తాక్రా అండర్ 14లో జాక్ సాయి, అండర్ 17లో డి.పవన్, స్విమ్మింగ్ అండర్ 14లో జి.పవన్, టేబుల్ టెన్నిస్ డి.పవన్, ఎల్. విక్రం, బి.పవన్ కళ్యాణ్, నెట్ బాల్ పోటీలకు జమ్ము యోగేష్ విజ్జి స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. ఈ సందర్భంగా వారిని హెచ్ఎం కస్తూరి, సెక్రటరీ నీలకంఠం, పీడీలు జి.ధర్మారావు,బి.మహేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆరోగ్య భృతి చెల్లించాలి

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు వారు చేస్తున్న ప్రత్యేక పారిశుధ్య పనికి సంబంధించి ప్రభుత్వం వృత్తిపరమైన ఆరోగ్య భృతి కింద ఇస్తామన్న రూ.4వేలు చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బచ్చల సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద సోమవారం గ్రీన్ అంబాసిడర్లతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు మూడు నెలల నుంచి జీతాలు కూడా చెల్లించడం లేదన్నారు. డెంకాడ పంచాయతీలో కార్మికులకు కేవలం రూ.6వేలు మాత్రమే చెల్లిస్తున్నారని తక్షణమే రూ.10వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు టి. ఆదినారాయణ, చంద్రరావు, ఎండ సన్యాసి, రాజేశ్వరి, రామలక్ష్మి, పైడితల్లి పాల్గొన్నారు.

శంకరరావుకు సన్మానం

ప్రజాశక్తి - గజపతినగరం

సంగీత, సాహిత్య, జానపద కళారూపాల బోధనలో వినూత్న పద్ధతులను రూపొందించిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు డాక్టర్ బొంతలకోటి శంకరరావుకు ప్రతిష్టాత్మక నేషనల్ గ్లోరీ అవార్డు లభించింది. విశాఖపట్నంలోని సాయిప్రియ బీచ్ రిసార్ట్స్‌లో శనివారం రాత్రి జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. కేంద్రప్రభుత్వ దూరదర్శన్ సోషల్ యాక్టివిస్ట్ డాక్టర్ ఒ.పి. పురోహిత్, పూరీ జగన్నాథ ఆలయం ప్రధాన పీఠాధిపతులు భవాని దాస్ మహరాజ్, దేశంలోని ప్రధాన విశ్వవిద్యాలయాల పూర్వ వైస్‌ఛాన్సలర్స్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సెంటర్ ఆచార్యులు ఈ అవార్డును శంకరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి భవాని దాస్ మహరాజ్ మాట్లాడుతూ శంకరరావు మాస్టర్ కళాబోధన దేశంలోనే అపూర్వ సృష్టి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూర్వ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ డివిజి శంకరరావు, సిడిసి ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.అన్నపూర్ణ, పువ్వల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో గల అనంతగిరి రేంజ్ కార్యాలయంలో అనంతగిరి ఫారెస్ట్ రేంజర్ జె.సుధీర్ తన సిబ్బందితో కలిసి సోమవారం ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీ సంపదను, వన్యప్రాణులను సంరక్షించడంలో అటవీ శాఖ సిబ్బంది సాహసోపేత విధానంలో కొన్నిసార్లు తమ ప్రాణాలను కూడా పణంగా పెట్టవలసి ఉంటుందని అన్నారు. అటువంటి వారిని స్మరించుకోవడం కోసం నవంబర్ 10వ తేదీ రాష్ట్ర అమరవీరుల దినోత్సవంగా నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ అధికారులు సత్యం, సీతారాం లక్ష్మీనారాయణ, కార్యాలయ సిబ్బంది లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎఎన్ఎంలకు రిలీవింగ్ ఆర్డర్లు ఇస్తున్న ఎంపిడిఒ సూర్యనారాయణ

ఎఎన్ఎంలకు రిలీవింగ్ ఆర్డర్లు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి వెల్నెస్ సెంటర్లో ఏఎన్ఎంగా పనిచేసిన ఎంఐవిఎస్ భాను గ్రేడ్ 3 ప్రమోషన్‌పై ఎస్‌కోట మండలంలోని ఆలుగుబల్లి, నల్లబెల్లిలో పనిచేస్తున్న పి. వెంకటలక్ష్మి వేపాడ సచివాలయానికి, వావిలిపాడులో పనిచేస్తున్న పి.హిమబిందు కొత్తవలస మండలం వెళ్లనుండటంతో వారికి ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ సోమవారం రిలీవింగ్ ఆర్డర్లను అందించారు. ఈ ప్రమోషన్ వల్ల శాశ్వత ఉద్యోగ భద్రత అదనంగా జీతం పొందుట, ప్రభుత్వపరంగా వచ్చే ప్రయోజనాలకు పొందుటకు అవకాశం కలుగుతుందని వారు ఆనందం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని రామలింగాపురంలో ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని గ్రామ ప్రజలందరకు స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకటరత్నాజీ, పిఎసిఎస్ చైర్మన్ కోళ్ల శ్రీను, బొబ్బిలి అప్పారావు మాస్టర్, లెంక శ్రీను, బంగారు రమేష్, కోరుపోలు అప్పారావు, గొంప దుర్గా ఉమేష్, బాధిరెడ్డి రమణ, సిరిమల్ల పైడిరాజు, కొట్టాన విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

ప్రజాశక్తి- రామభద్రపురం

మండల పరిధిలోని గిరిశిఖర ప్రాంతం ఎనుబరువు ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రముఖ సామాజిక సేవాసంస్థ కారుణ్య ఫౌండేషన్ బీరువాను వితరణగా అందజేసింది. ఇక్కడ పనిచేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముసలయ్య అభ్యర్థన మేరకు పాఠశాల రికార్డులు, ఇతర ఉపకరణాలు భద్రత కోసం బీరువాను అందజేసినట్లు ఆ సంస్థ చైర్మన్ జేసి రాజు తెలిపారు. కోరిన వెంటనే రూ.10వేలు విలువైన బీరువాను అందజేసిన కారుణ్య ఫౌండేషన్ సేవలను కొనియాడుతూ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

గాయపడిన వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- కొత్తవలస

స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్ దగ్గర 15 రోజులు క్రితం గుర్తు తెలియని వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన సోమవారం మృతి చెందారని సిఐ సిహెచ్ షణ్ముఖరావు తెలిపారు. మృతున్ని ఎవరైనా గుర్తించి వారి కుటుంబ సభ్యులకు తెలియజేయాలని ఆయన కోరారు.

గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించండి

మోకాలు లోతు బురదలో గిరిజనుల వినూత్న నిరసన

బురదలో నిరసన తెలుపుతున్న గిరిజనులు, చిన్నారులు

ప్రజాశక్తి-గజపతినగరం

బొండపల్లి మండలం గొల్లుపాలెం పంచాయతీ పరిధిలోని ఎర్రొడ్డపాలెం, చిన్న గూడెంతో పాటు అల్లూరి జిల్లా అనంతగిరిమండలం రొంపల్లి పంచాయతీ గూడెం మీదుగా వెళ్లే రహదారిని బాగు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఏపి గిరిజన సంఘం ఆధ్వర్యాన పలువురు గిరిజనులు, చిన్నారులు మోకాలు లోతు బురదలో నిరసన తెలిపారు. ఆ బురదలోనే సుమారు రెండు కిలోమీటర్లు దూరం పాదయాత్ర చేపట్టారు. చిన్నగూడెం నుండి గొల్లపాలెం గ్రామానికి వెళ్లే మార్గ మధ్యలో బురదలో చేతులు జోడించి జిల్లా కలెక్టరుకు రహదారిని బాగు చేయాలని వేడుకున్నారు. చిన్న గూడెం నుండి సుమారు మూడున్నర కిలోమీటర్ల దూరం గొర్రి (గెడ్డవాగు) నుండి ప్రయాణం చేస్తే గొల్లపాలెం రోడ్డు చేరుకుంటామని, అయితే ఆ రహదారిలో వర్షాకాలంలో నిత్యం నీరు ప్రవహించడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. తమ పిల్లలు పాఠశాలలకు వెళ్లాలంటే బురదలో నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందారు. వైద్యం కోసం ఆస్పత్రులకు వెళ్లాలన్నా డోలీ కట్టుకుని బురదలో వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. చిన్న గూడెం నుండి కొండ శిఖరా గూడెం వెళ్లేందుకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారని, అది ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయిందని తెలిపారు. గొల్లపాలెం నుండి చిన్న గూడెం రోడ్ వేస్తేనే అల్లూరి జిల్లా అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయితీ గూడెం గ్రామానికి అంబులెన్సులు వెళ్లేందుకు అవకాశం ఉందని తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడం లేదని కలెక్టర్ స్పందించి తమ గ్రామానికి రహదారి వేయాలని కోరారు. కార్యక్రమంలో రొంపిల్లి పంచాయితీ 2వ వార్డు సభ్యుడు సోమిల అప్పలరాజు, గిరిజన సంఘం నాయకుడు కోనపర్తి సింహాచలం. చిన్న గూడేనికి చెందిన సూకూరు సింహాచలం. తదితరులు పాల్గొన్నారు

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 10వేలు జరిమానా

ప్రజాశక్తి - రామభద్రపురం

సాలూరుకు చెందిన ఎం.పవన్ మండల పరిధి కొట్టక్కి చెక్ పోస్ట్ వద్ద పోలీసులు చేస్తున్న వాహన తనిఖీల్లో పట్టుబడటంతో జరిమానా విధించారు. ఎస్ఐ ప్రసాదరావు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 8న సాలూరు నుంచి రామభద్రపురం వెళ్లేందుకు ద్విచక్ర వాహనం పై వస్తున్న పవన్‌ను వాహన తనిఖీల్లో భాగంగా చెక్ చేయగా మద్యం సేవించినట్లు ఆనవాళ్లు కనుగొని డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేశారు. దీంతో మద్యం సేవించినట్లు తేలడంతో కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా సాలూరు మునిసిఫ్ మెజిస్ట్రేట్ హర్షవర్ధన్ రూ.10వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. ఎంతటి వారైనా డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్లు వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు.

కల్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

జిందాల్ నిర్వాసితులను ఆదుకోండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిందాల్ యాజమాన్యం భూమిని తీసుకొని నిర్వాసితులను మోసం చేయడం వల్ల ఉన్నదంతా కోల్పోయారని నిర్వాసితులను తక్షణమే ఆదుకోవాలని సిపిఎం నాయకులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. సోమవారం బొడ్డవరలో నిర్వాసిత శిబిరం వద్ద నిర్వాసితులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ గతంలో నిరుపేదలుగా గుర్తించి జీవనోపాధి చేసుకొండని ప్రభుత్వం ఢీ ఫారం భూమి ఇస్తే నిర్వాసితుల వద్ద ఉన్న మొత్తం భూమిని మోసపూరితంగా వ్యవహరించి మూడు సంవత్సరాల్లో కంపెనీ కట్టి అందులో అందరికీ ఉద్యోగాలు ఇస్తామని నమ్మ బలికి, భూమంతా తీసుకున్న తర్వాత 18 సంవత్సరాలు దాటిన ఎటువంటి కంపెనీ నిర్మించకుండా ఆ భూమిని అమ్మకానికి పెట్టడం అన్యాయమన్నారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకూ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం

ప్రజాశక్తి- సంతకవిటి

తెలంగాణ మాదిరిగా ఆంధ్రప్రదేశ్‌లో విఆర్‌ఎలకు పేస్కేలు, ప్రమోషన్లు, నామినీ సమస్య పరిష్కారం చేయాలని లేకపోతే భవిష్యత్తులో ఉద్యమం చేపడతామని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని విఆర్‌ఎల సంఘం ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ కేంద్రంగా జరిగిన సిఐటియు పోరాటాల ఫలితంగా ప్రభుత్వం అన్ని తహశీల్దార్ కార్యాలయాల నుండి విఆర్‌ఎల సమాచారాన్ని సేకరిస్తోందని తెలిపారు. విఆర్‌ఎల ప్రమోషన్లు, పే స్కేలు, నామినీ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. 8ఏళ్ళుగా వేతనాలు పెరగలేదని, వారిని అక్రమ డ్యూటీలకు బలవంతం చేస్తూ శ్రమదోపిడీ జరుగుతోందని దీన్ని ఖండిస్తున్నామని అన్నారు. విశాఖలో జరగబోయే సిఐటియు అఖిల భారత మహాసభలు విజయవంతం కావడానికి కృషి చేయాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షుడు ఎస్.రాము, నాయకులు ఎస్.రమణ, రాముప్పుడు, శివకుమార్, తవుడు, దాలయ్య, సుజనమ్మ, లక్ష్మి, ఆదిలక్ష్మి, త్రినాధ్ పాల్గొన్నారు.

సంతకవిటి: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, విఆర్‌ఎలు

రేగిడి: విఆర్‌ఎలు ఐక్యంగా పోరాడితే సమస్యలు పరిష్కరించుకోగలమని సిఐటియు జిల్లా అధ్యక్షులు కే.సురేష్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆ సంఘం అధ్యక్షుడు ఈ జగన్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం సమస్యలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 31 నుంచి జనవరి 4వరకూ విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అర్హులైన విఆర్‌ఎలకు ప్రమోషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. వెంటనే ఖాళీగా ఉన్న అటెండర్, నైట్ వాచ్మెన్, రికార్డ్ అసిస్టెంట్, విఆర్ఒ ప్రమోషన్లను వన్ టైం సెటిల్మెంట్ కింద భర్తీ చేయాలని కోరారు. ఏళ్ల తరబడి నామినీలుగా కనిపిస్తున్న వారిని విఆర్‌ఎలుగా గుర్తించడం లేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విఆర్‌ఎలకు పే స్కేలు అమలు చేయాలని, అటెండర్, నైట్ వాచ్మెన్ ప్రమోషన్ శాతాన్ని 70శాతంకు పెంచాలని, అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు జగన్, పాదాలు, సత్యనారాయణ, బాలరాజు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- దత్తరాజేరు

ఈ నెల 12న నియోజకవర్గ కేంద్రంలో చేపట్టనున్న ప్రజా ఉద్యమ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపిపి సింహాద్రి అప్పలనాయుడు, వైసిపి మండల అధ్యక్షులు రాపాక కృష్ణార్జున కోరారు. సోమవారం దత్తరాజేరు మాజీ సర్పంచ్ మహాదేవ ఫణేంద్ర ఇంటి వద్ద వైసిపి నాయకులు ప్రజా ఉద్యమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే ప్రభుత్వ పేదలకు నాణ్యమైన విద్య వైద్యం అందదని దీన్ని ప్రతిఘటించే నిరసన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి మంత్రి అప్పలనాయుడు, వైస్ ఎంపిపి మిత్తిరెడ్డి రమేష్‌నాయుడు, సర్పంచ్ క్రాంతి కుమార్, యువజన నాయకుడు దత్తి చిరం జీవి, శ్రీను, శంకర్, సింహాచలం, పాల్గొన్నారు.

కొత్తవలస: స్థానిక వైసిపి క్యాంపు కార్యాలయంలో 'ప్రజా ఉద్యమం' పోస్టర్‌ను సోమవారం వైసిపి రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడుబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న నియోజకవర్గ కేంద్రంలో జరిగే ర్యాలీలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గోరపల్లి శివ, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, మమ్ములూరి జగన్నాథం, మోపాడ కుమార్, గుమ్మడి సత్యన్నారాయణ, గొర్లె రవికుమార్, ఎంపిపిలు నీలంశెట్టి గోపమ్మ, దొగ్గ సత్యవంతుడు, సబ్బావరపు అరుణ, జెసిఎస్ కన్వీనర్ బొంతల వెంకటరావు, వైస్ ఎంపిపిలు పినిశెట్టి వెంకటరమణ, అడపా ఈశ్వంరావు, వాకాడ రాంబాబు, వకాడ సతీష్, పోలమరశెట్టి రామకృష్ణ, ఇధెంసెట్టి అనిల్, వెలగల వెంకటరమణ, సర్పంచులు జామి ఈశ్వరరావు, శివకోటి పాల్గొన్నారు.

నెల్లిమర్ల: చంద్రంపేటలో సోమవారం మెడికల్ కాలేజీలను ప్రైవేటీ కరణను నిరసిస్తూ వైసిపి నాయకులు పోస్టర్ విడుదల చేశారు. 12న చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కర్రోతు వెంకటరమణ, వాళ్లే అప్పలనాయుడు, నాయుకులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా సంరక్షకుడు సిపి బ్రౌన్

ఫిలిప్ బ్రౌన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న రాజు

ప్రజాశక్తి- బొబ్బిలి

తెలుగు భాష సంరక్షకుడు, చిరస్మరణీయుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జెసి రాజు అన్నారు. సోమవారం కారుణ్య ఫౌండేషన్ కార్యాలయంలో సిపి బ్రౌన్ 227వ జయంతిని కారుణ్య కార్యదర్శి సిహెచ్‌జె ప్రవీణ్ కుమార్ నిర్వహించారు. బ్రౌన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విదేశీయుడు అయినా ఆయన తెలుగు భాషకు, సాహిత్యానికి చేసిన కృషి చిరస్మరణీయం అన్నారు. మన జాతీయ కవి అయిన వేమన పద్యాలను వర్సెస్ ఆఫ్ వేమన అనే పేరుతో ఆంగ్లంలోకి అనువాదించారన్నారు. తెలుగు -ఇంగ్లీష్, మిశ్రమ నిఘంటువులను కూర్చిన ప్రాతః స్మరణీయుడు బ్రౌన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సహ కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి చిన్నారావు, కార్యవర్గ సభ్యులు జి సిహెచ్ జి శర్మ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య సంస్థకు నేషనల్ గ్లోరి అవార్డ్

సుదీర్ఘ కాలం జిల్లాలో ముఖ్యంగా బొబ్బిలి పట్టణం పరిసర ప్రాంత ప్రజలకు సేవలం దిస్తూ వారి మన్నలను పొందుతున్న ప్రముఖ సామాజిక సేవా సంస్థ కారుణ్య ఫౌండేషన్‌కు గుర్తింపు లభించింది. ఆదివారం రాత్రి విశాఖపట్నం, ఋషి కొండలోని శ్రీ సాయి ప్రియ బీచ్ రిసార్ట్‌లో కమ్యూనిటీ డెవలప్మెంట్ సెంటర్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.అన్నపూర్ణ ఆధ్వర్యంలో కారుణ్య సంస్థ చేస్తున్న సేవలకు గుర్తింపునిస్తూ ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ జెసి రాజుకు అవార్డును అందించారు.

ఎమ్మెల్యే, ఎమ్‌పి పట్టించుకోవడం లేదు

శృంగవరపుకోట: మండలంలో వైసిపి నుంచి టిడిపిలో చేరిన సర్పంచులు, ఎంపిటిసిలను ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, ఎమ్‌పి శ్రీభరత్ పట్టించుకోవడం లేదని పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు బహిరంగంగానే చెబుతున్నారు. తమ గ్రామానికి వచ్చినప్పుడు పార్టీలో ఉన్న తమకు సమాచారం ఇవ్వకుండా వచ్చి వెళ్ళిపోతున్నారని వాపోయారు. వారంతా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏపి టూరిజం బోర్డ్ డైరెక్టర్ ఇందుకూరి సుధారాజుకు మొరపెట్టుకున్నారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు తామంతా నారా లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరామని తమతో పనులు చేయించుకొని ఎన్నికల తరువాత తమని పట్టించుకోలేదని చెప్పారు. తమకు ఎటువంటి నామినేటెడ్ పదవులూ ఇవ్వకపోయినా ఆందోళన చెందలేదని, కార్యకర్తలకు ఇవ్వవలసిన కనీస గౌరవం ఇవ్వడం లేదని ఇప్పటికైనా పార్టీ పెద్దలు ఆలోచన చేసి సరైన నిర్ణయం తీసుకోకుంటే రానున్న రోజుల్లో స్వతంత్రంగా ఎన్నికల బరిలోకి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎంపిపి సోమేశ్వరరావు, మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, ఎంపిటిసిలు మజ్జి దేవి, వాకాడ సింహాచలం, బోధల దేముడు, దారగిరి, మాజీ ఎంపిపి ఒంటి అప్పారావు, సర్పంచులు యాళ్ల రమణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలి : ఎస్‌పి

ప్రజాశక్తి- దత్తిరాజేరు

సైబర్ నేరాలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని ఎస్‌పి ఎఆర్.దామోదర్ అన్నారు. మండలంలోని ఎస్ బూర్జవలస, పెదమానాపురం పోలీస్ స్టేషన్లను ఆయన సోమవారం పరిశీలించారు. ముందుగా పోలీస్ స్టేషన్ చుట్టు పక్కల పరిసరాలను పరిశీలించారు. సీజైన వాహనాలను కోర్టు ద్వారా వేగవంతంగా పరిష్కారం చేయాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి తాగినా, అమ్మినా, రవాణా చేసినా చట్టపరమైన క్రిమినల్ కేసులు పెడతామన్నారు. సైబర్ క్రైమ్‌లపై తక్షణమే చర్యలు చేపడతామని వాటిపై అవగాహన కలిగి ఉండాలని, ఫోన్ కాల్ వస్తే వారికి లొంగిపోకూడదని వెంటనే పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేయాలని అన్నారు. ఆయన వెంట బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డి, సిఐ రమణ, ఎస్ఐలు రాజేష్, జయంతి సిబ్బంది పాల్గొన్నారు.

దత్తిరాజేరు : రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి

దిబ్బగుడ్డివలసలో పల్లెనిద్ర

బొబ్బిలి: మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామంలో జిల్లా ఎస్‌పి ఎ.ఆర్ దామోదర్ ఆదివారం రాత్రి 'పల్లె నిద్ర' చేపట్టి, ప్రజలతో మమేకమయ్యారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేసే సంకల్పంతో 'పల్లెనిద్ర' చేపట్టాలని అధికారులను ఆదేశించండంతోపాటు, ఆయన కూడా స్వయంగా 'పల్లె నిద్ర' కార్యక్రమంలో భాగంగా మారుమూల గ్రామంలో రాత్రి బస చేసి, అధికారులకు ఆదర్శంగా నిలిచారు.

గజపతినగరం: నేర రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎస్‌పి దామోదర్ పోలీస్ సిబ్బందికి సూచించారు. సోమవారం గజపతినగరం, బొండపల్లి, ఆంధ్ర పోలీస్ స్టేషన్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశీలించడంతోపాటు రికార్డులు తనిఖీ చేశారు. రహదారి ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గజపతినగరం సిఐ జివి రమణ, ఎస్.ఐ కిరణ్ కుమార్, బొండపల్లి ఎస్ఐ మహేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పంచాయతీలో ఉన్న సమస్యలను పరిష్కరించి పంచాయతీకి ఆదాయం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఆమ్‌ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పూసపాటి ప్రతాప్ వర్మ సోమవారం జిల్లా గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపులకు సుమారు 15 ఏళ్లగా బహిరంగ వేలం లేక షాపులను అధిక రేట్లకు అద్దెకి ఇస్తూ పంచాయతీ ఆదాయానికి కొందరు గండి కొడుతున్నారని అన్నారు. బహిరంగ వేలం ద్వారా అసలైన వ్యాపారస్తులకు కేటాయించాలని, పట్టణంలో గల గాంధీ పార్కు ఆక్రమణలకు గురవుతుందని, పార్కును ఆధునికరించి ఆక్రమణ నుండి కాపాడాలని కోరారు. ఎన్‌టిఆర్ మార్కెట్ యార్డులో షాపులు నిర్వహించకపోవడంతో రాత్రులు అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ సమస్యలకు తగు చర్యలు తీసుకొని పరిష్కారం చూపాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

ఎంఎస్ఎంఇ పార్క్ ఏర్పాటు చేయాలి

శృంగవరపుకోట: జిందాల్ భూములలో ఎంఎస్ఎంఇ పార్క్ ఏర్పాటు చేయాలని సామాజిక కార్యకర్త దొడ్డి సూర్యారావు తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిందాల్ భూ కుంభకోణంపై 2015లో లోకాయుక్త ఇచ్చిన తీర్పుని అమలు చేయాలని, జిందాల్ భూసేకరణలో నిజమైన రైతులు ఎవరన్నది నిర్ధారణ చేసి జిందాల్ కంపెనీ రైతులకు ఇచ్చినమాట ప్రకారం ఆర్‌ఆర్‌ప్యాకేజీ అమలు చేయాలని, ఈ ప్రాంత నిరుద్యోగ సమస్యను తీర్చడానికి ఎంఎస్ఎంఇ పార్క్ ఏర్పాటు చేయాలని, ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేసే ముందు ప్రభుత్వం నిజమైన రైతులతోనూ జిందాల్ కంపెనీతోనూ ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వం రైతులను సంతృప్తి పరిచేలా తగుచర్యలు చేపట్టాలని కోరారు.

భవనం మార్పునకు ఆదేశాలు

వేపాడ: మండలంలోని బల్లంకిలో హోమియో వైద్య సేవలు అందించే భవనం శిథిలావస్థకు చేరడంతో వైద్య సేవలు అందించడానికి ఇబ్బందిగా మారింది. దీంతో సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు భవనం అదే గ్రామంలో అందుబాటులో ఉన్న వెల్నెస్ సెంటర్‌లోకి మార్పు చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు. స్పందించిన కలెక్టర్ మూడు రోజుల్లో హోమియో ఆసుపత్రిని అదే గ్రామంలో ఉన్న వెల్నెస్ సెంటర్ భవనంలోకి మార్పు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు అప్పారావు తెలిపారు.

గృహ నిర్మాణాలకు జియో ట్యాగింగ్

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలో నూతనంగా మంజూరైన పక్కా గృహ నిర్మాణాల కోసం గ్రామ పంచాయతీల్లో జియో ట్యాగింగ్ చేపడుతున్నామని మండల హౌసింగ్ అధికారి వెంకటేష్ తెలిపారు. సోమవారం బూసాయవలసలో ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 22 గ్రామ పంచాయతీల్లో ఇప్పటివరకు 1370 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. మంజూరైన వారిళ్లకు వెళ్లి వారి వివరాలు సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లు తీసుకుంటున్నారని తెలిపారు. ఇళ్లు మంజూరై దూరంగా ఉన్న వ్యక్తులు వెంటనే గ్రామాలకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కొత్తవలస

తమ గ్రామంలో సామాజిక భవనం, తాగునీటి సౌకర్యం కల్పించాలని మండలంలోని అప్పన్నదొరపాలెం జనసేన కార్యకర్తలు ఎమ్మెల్యే లలిత కుమారికి వినతిపత్రం అందించారు. తమ గ్రామంలోకి అధికారులు కానీ ప్రజా ప్రతినిధులు గాని హాజరైతే కనీసం కూర్చునేందుకు ఒక భవనం కూడా లేదని, మంచినీరు తాగేందుకు వాటర్ ట్యాంక్ లేదని నియోజకవర్గ జనసేన నాయకుడు వబ్బిన సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే ఎస్‌టి సబ్ ప్లాన్‌లో ఈ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గిరిజన నాయకులు ప్రజలు ఎమ్మెల్యేకి అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందిస్తున్న యువకులు

CHANGE OF NAME

This is to inform that I, Ms.Penta Lakshmi D/o Penta Sitaramnaidu, (as in S.S.C. Certificate) change my name as Vengala Lakshmi Rani w/o Narayana Rao (after marriage) as in Adhar, Passport etc. for all purposes.

Vengala Lakshmi Rani
Dadithalli Colony, Bobbili,
Vizianagaram District,
Andhra Pradesh
Ph : 7893678533, 9885419555

మండల ప్రజా పరిషత్ కార్యాలయము, చీపురుపల్లి.

వేలం ప్రకటన **తే.10.11.2025 ది.**

ఈ కార్యాలయములో నిరుపయోగమైన ఇనుప సామాను (Scrap)ను తే 13.11.2025 దిన ఉదయము గం.10.00 ని.లకు మండల ప్రజా పరిషత్ కార్యాలయము వద్ద వేలం వేయబడును. ఆసక్తిగలవారు ఈ వేలంలో పాల్గొనవచ్చును. మిగిలిన వివరములు కార్యాలయము పనివేలల్లో పొందవచ్చును.

మండల పరిషత్ అభివృద్ధి అధికారి
మండల ప్రజా పరిషత్, చీపురుపల్లి.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT VIZIANAGARAM
I.P. No 17 / 2025

Between:
Chinni Rama Koti ......Petitioner.
And:
Kolli Appanna and eight others... Respondents.
To
1 to 9 respondents
1. Kolli Appanna S/o Kanakayya, Simmapeta Village, Bhogapuram Mandal, Vizianagaram District
2. Vonimi Srinu S/o Ramudu, Simmapeta Village, Bhogapuram Mandal, Vizianagaram District
3. Kolli Ramu S/o Apparao, Simmapeta Village, Bhogapuram Mandal, Vizianagaram District
4. Kolli Ramarao S/o Ramudu, Simmapeta Village, Bhogapuram Mandal, Vizianagaram District
5. Kolli Srinu S/o Tatayya, Simmapeta Village, Bhogapuram Mandal, Vizianagaram District
6. Vonimi Apparao S/o late Sadhuvu Rangasthalam Village, Bhogapuram Mandal, Vizianagaram district.
7. Kolli Srinu S/o late Gurayya, Chintalapeta Village, Bhogapuram Mandal, Vizianagaram District
8. Udikalá Gurumurty S/o Ramu, Sakivalasa Village, Bhogapuram Mandal, Vizianagaram district.
9. Bajaj Finance Pvt., Ltd., rep., by its Branch Manager, Tagarapuvalasa Branch, Tagarapuvalasa, Visakhapatnam

NOTICE

Please take notice that the above name petitioner has filed the above petition against the respondents declaring the petitioner as insolvent on the file of the honourable court of the Principal Civil Judge (Senior Division) at Vizianagaram, Andhra Pradesh state and for the reason of non service of notices to the respondents 1 to 9, this notice is to be published in the paper enabling the respondents 1 to 9 to appear before this Honourable Court as per the orders of the Honourable Court.

So the respondents 1 to 16 should appear before this Honourable court on **10-12-2025 at 10-30 A.M** either individually or through Advocate as per the order of the Honourable Principal Civil Judge (Senior Division) at Vizianagaram, in default of your appearance on that day the petition will be heard and determined in your absence basing on the material available in the court.

Sri K. Surya Tej
Advocate, Vizianagaram,
Mobile: 86888 88399